క్లుప్తంగా

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి



పీఓ, ఏపీఓల శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఆర్వో విష్ణుచరణ్

సాలూరు: సాలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ గురువారం పూర్తయింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన ఈ ప్రక్రియను ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ పర్యవేక్షించారు. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను చేపట్టారు. అనంతరం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న రెండో విడత శిక్షణ తరగతులను ఆర్వో విష్ణుచరణ్ పరిశీలించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎలక్ట్రికల్ అధికారులు

పాచిపెంట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎలక్ట్రికల్ డీఈ ఫణీంద్ర, ఏడీఈ రంగారావు, సెక్షన్ ఏడీఈ సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. రూ.1.20 కోట్లతో 5 ఎంవీఏ అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగ

- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు



నిర్మానుష్యంగా ఉన్న ఖడ్గవలస జంక్షన్

పార్వతీపురం: వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటు వడగాలులు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చల్లదనం కోసం చెట్ల కిందకు చేరుతున్నారు. గురువారం ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరుకుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని, అత్యవసరమ పనులపై బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని, లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి సూచించారు.

వడదెబ్బకు గురైతే ప్రథమ చికిత్స ఇలా..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి వచ్చేవరకు అలాగే చేస్తుండాలి. చల్లని గాలి తగిలే విధంగా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకువెళ్లాలి.
- తెలుపు రంగు పలుచటి వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ లేదా టవల్ కట్టుకోవాలి.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య అధిక శారీరక శ్రమ చేయకూడదు.
- శీతల పానీయాలు, ఐస్ క్రీములు తీసుకుంటే తాత్కాలికంగా చల్లదనం ఉన్నా.. గొంతు సంబంధించిన సమస్యలు/వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- రోజుకు కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలి.

ప్రభుత్వోన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ కోర్సులు

సీతంపేట: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో 2024 – 25 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహించనున్నట్టు హెచ్ఎం హేమసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో ఏవైనా రెండు గ్రూపులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ గ్రూపుకు 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉంటాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమౌతాయని తెలిపారు.

పింఛన్ల కోసం పండుటాకుల పాట్లు

- పింఛన్ డబ్బుల కోసం బ్యాంకుల వద్ద క్యూ..
- మండుటెండలో అవస్థలు
- చంద్రబాబు, టీడీపీ నాయకులపై లబ్ధిదారుల మండిపాటు



సీతానగరం: పెదబోగిలి ఎస్‌బీఐ వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

మక్కువ: పింఛన్ల కోసం పండుటాకులు మండుటెండలో అవస్థలు పడుతున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం పింఛన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబునాయుడుపై అవ్వాతాతలు మండిపడుతున్నారు. ముసలోళ్లపై కక్షసాధింపు ఏంటని టీడీపీ నాయకులను నిలదీస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవాళ్లమని, ఇప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన పనితో పింఛన్ల కోసం మండుటెండలో బ్యాంకుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ నెల ఒకటో తేదీన వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను అడ్డుపెట్టుకుని చంద్రబాబు తన అనుచరుడు నిమ్మగడ్డ రమేష్ ద్వారా పింఛన్ల పంపిణీపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీని అడ్డుకోవాలని అందులో కోరారు.

దీంతో పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. ఏప్రిల్ నెల పింఛన్లను గ్రామ సచివాలయాల వద్ద అందజేయగా.. తీవ్ర ఎండలో వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఈ



మక్కువ: మక్కువ స్టేట్‌బ్యాంక్ వద్ద పింఛన్‌దారుల పడిగాపులు

నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మే నెల పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన రోగులకు సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంది.

సీతానగరం: మండలంలో 11,639 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. అందులో దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు 3428 మంది ఉన్నారు. వారందరికీ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మిగిలిన 8211 మంది లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం పింఛన్ డబ్బులు జమ చేసింది. దీంతో పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. ఒకటో తేదీ మేడే సందర్భంగా బ్యాంకులకు సెలవు కావడంతో గురువారం ఉదయం 9.30 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. మండుటెండలో నిరీక్షించాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డారు. వివిధ కారణాలతో పలువురు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు. తమ పింఛన్లు అడ్డుకున్న చంద్రబాబు, టీడీపీ నాయకులపై వారంతా మండిపడుతున్నారు.

మా ఉసురు తగులుతుంది



నాకు వృద్ధాప్య పింఛన్ అందుతోంది. ఈ నెల పింఛన్ బ్యాంకులో వేశారని చెప్పారు. డబ్బులు తీసుకునేందుకు మా ఊరు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకుకు నడుచుకుంటూ రావాల్సి వచ్చింది. మండుటెండలో మా లాంటి ముసలోళ్లను ఇబ్బందులకు గురిచేసిన టీడీపీ నాయకులకు మా ఉసురు తగులుతుంది.

– తంగుడు నారాయణమ్మ, పింఛన్ లబ్ధిదారు, మేళాపువలస

ఇది మంచి పద్ధతి కాదు



పింఛన్ డబ్బులే మాలాంటి వృద్ధులకు ఆధారం. ఇన్నాళ్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. గత రెండు నెలలుగా పింఛన్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఈ నెల పింఛన్ బ్యాంకులో వేస్తారని చెప్పడంతో అతికష్టంపై బ్యాంకుకు వచ్చాను. నడవలేక ఎంతో మంది వృద్ధులు బ్యాంకుకు కూడా రాలేని పరిస్థితి. మండుటెండలో వృద్ధులను ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు. ఈ పాపం చంద్రబాబుదే.

– అన్ను రామినాయుడు, పింఛన్‌లబ్ధిదారు, మేళాపువలస గ్రామం

వలంటీర్లు లేకపోవడంతోనే ఈ కష్టాలు



జగనన్న ప్రభుత్వం ప్రజలకు సేవలందించేందుకు వలంటీర్లను నియమించింది. ప్రతీ నెల ఒకటో తేదీన వారితో ఇంటి వద్దకే పింఛన్లు పంపించేది. ఇప్పుడు వారి సేవలను చంద్రబాబు అడ్డుకున్నాడట. అందుకే వారిని తొలగించారని అనుకుంటున్నారు. ఈ నెల పింఛన్ డబ్బులు బ్యాంకులో వేయడంతో ఎండలో ఇబ్బందులు పడుతూ బ్యాంకుకు రావాల్సి వచ్చింది. వలంటీర్లు లేకపోవడంతో మాకీకష్టాలు వచ్చాయి.

– నాగూరు నర్సమ్మ, పింఛన్ లబ్ధిదారు, అజ్జాడ గ్రామం, సీతానంగరం మండలం

చంద్రబాబు, పవన్‌లను నమ్మొద్దు

- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు ఘనస్వాగతం పలికిన కొండలింగాలవలస గ్రామస్తులు

మెంటాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజల ముందుకు వస్తున్న టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను నమ్మవద్దని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొండలింగాలవలస, చింతాడవలస, జక్కువ, పెదచామలాపల్లి, పెదమేడపల్లి, కుంటినవలస గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ తపన అని, ఆ దిశగా ఆయన ఐదేళ్ల పరిపాలన కొనసాగిందని, ప్రజలు కూడా ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, తాము ఇవి చేశాం అని ప్రజల ముందుకు ధైర్యంగా వస్తున్న వైఎస్సార్ సీపీని, పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించి, గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల వేళ మళ్లీ బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న టీడీపీ కూటమి నేతలను అస్సలు నమ్మవద్దన్నారు. 2014 ఎన్నికల్లోనూ ఇదే కూటమి 650 హామీలు ఇచ్చి, మోసం చేసిన విషయం ప్రతి ఒక్కరూ గుర్తు తెచ్చుకోవాలన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, ఎమ్మెల్యేగా మరోసారి పోటీ చేస్తున్న తనను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందం పోయే.. ఆందోళన మొదలాయే..

- టీడీపీ ప్రచారానికి కరువైన జనాదరణ
- డబ్బులకు ఆశపడి సైకిల్ ఎక్కిన నేతలు ఇంటికే పరిమితమవుతున్న వైనం..
- సినీ నటులు, కేంద్ర మంత్రులు వచ్చినా రాని జనాలు
- పార్వతీపురం అసెంబ్లీ స్థానంపైన తగ్గిన ఫోకస్



పార్వతీపురంటౌన్: ఎన్నికలకు పట్టుమని 10 రోజుల్లేవు. ఈ స్థితిలో ప్రచారాలతో పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బలాన్ని చాటుతుంటాయి. అయితే పార్వతీపురంలో ప్రతిపక్ష టీడీపీ పరిస్థితి దయనీయంగా మారిందని స్థానికంగా గుసగుసలాడుకుంటున్నారు. ధనబలంతో ఏదైనా చేయొచ్చనే ధీమాతో ఇప్పటి వరకు ఉన్న బోనెలలో టెన్షన్ మొదలైనట్టు చర్చించుకుంటున్నారు. నిజానికి టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్రకు ప్రత్యక్ష రాజకీయాల్లో ఎలాంటి అనుభవం లేదు. కానీ ఆ పార్టీ అధిష్ఠానం ఆయనకు పార్వతీపురం అసెంబ్లీ టికెట్‌ను కేటాయించింది. ఈ క్రమంలో తన బలాన్ని ప్రదర్శించాలనే భావనతో నగదు ప్రలోభాలకు గురిచేసి పలువురు నేతలను ఆకర్షించారు. అయితే టీడీపీలో చేరిన నేతల్లో చాలా మంది అక్కడ ఇమడలేక తిరిగి తమ సొంతగూటికి చేరుకుంటుండటంతో వారి వ్యూహాలు బెడిసి కొట్టాయన్న చర్చ జోరందుకుంది.

ప్రజల నుంచి స్పందన కరువు

టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బోనెల విజయచంద్రకు నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో ప్రజాదరణ లభించడం లేదు. టీడీపీ నిర్వహిస్తున్న సభలకు డబ్బులిచ్చి జనాలను తరలిస్తున్నా, కొద్దిసేపటికే ముఖం చాటేస్తున్నారు. ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టోను ప్రకటించడంతో చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం మరింత సన్నగిల్లింది. స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులను కొన్నంత సులభంగా ఓట్లు బదిలీ అవుతా యనే వారి భ్రమలు తొలగిపోయాయి.

ఓటేయాలని అడిగే నాథుడేడీ..?

విజయచంద్ర తరఫున విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముఖం చాటేస్తున్నారని సమాచారం. ఖర్చులకు డబ్బులివ్వందే ప్రచారం చేయలేమని ఖరాఖండీగా చెప్పేస్తున్నారంట. బోనెల తరఫున ప్రచారం చేసే నాయకుడే కరువయ్యాడు. గురువారం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ హాజరయ్యారు. ఈ సమావేశానికి టీడీపీ ముఖ్యనాయకులు గైర్హాజరయ్యారు.

మారిన క్షేత్రస్థాయి పరిస్థితులు

వాస్తవానికి క్షేత్రస్థాయిలో టీడీపీకి ప్రజాదరణ లేకపోయినా.. డబ్బు మూటలతో ఓట్లు కొల్లగొట్టొచ్చనే ధీమాతో ఉన్నారు. అయితే నామినేషన్లకు ముందే భవిష్యత్‌పై ఓ స్పష్టత వచ్చింది. మరోవైపు బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆర్థిక బలంతో అరకు లోక్‌సభ పరిధిలోని టీడీపీ అభ్యర్థులు తాము గెలిచేస్తామని కలలుగన్నారు. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులపై వారికి ఇప్పుడిప్పుడే ఓ క్లారిటీ వస్తోంది. మరోవైపు నగదు ప్రలోభాలతో టీడీపీ మాజీలను తమవైపు తిప్పుకొన్నా.. ఆ ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

గ్రూపులతో తలనొప్పి

పార్వతీపురంపై ఇప్పటివరకు దృష్టి సారించిన బోనెల తాజాగా ఆ ఫోకస్‌ను తగ్గించారని తెలుస్తోంది. టీడీపీకి క్షేత్రస్థాయిలో బలం లేకపోవడం.. ప్యాకేజీలు ఇచ్చి తెచ్చుకున్న నేతలతో ఒరిగేదేమీ లేదని గ్రహించారు. గ్రూపు రాజకీయాలు బోనెల తలనొప్పిగా పరిణమించాయి. నిన్నమొన్నటి వరకు భారీగా ఖర్చు పెట్టిన వీరు ఇప్పుడు తగ్గించేశారనే టాక్ వినిపిస్తోంది.

సైలెంట్‌గా సైడ్ చేశారు

నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు వ్యూహకర్త మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వరావు అనే ఉద్దేశంతో ఆయన్ను సైలెంట్‌గా సైడ్ చేశారని సమాచారం. ఎన్నికల ఖర్చుల వ్యవహారాలను చూసేందుకు తమ సొంత టీమ్‌ను రంగంలోకి దింపారని తెలుస్తోంది.

కప్పిపుచ్చుకొనేందుకు ప్రయత్నాలు

కుటమి అభ్యర్థుల ప్రచారానికి జనాదరణ కరువైంది. వార్డుల్లో, గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి స్థానిక నాయకులు సొంత ఖర్చులు పెట్టాల్సిన పరిస్థితి నెకొంది. దీంతో స్థానిక టీడీపీ నాయకులే ప్రచారానికి దుమ్మా కొడుతున్నారు. ఏమి చేయాలో తోచక అది కప్పిపుచ్చుకొనేందుకు అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు ప్రచారానికి సినీనటులు, కేంద్ర మంత్రుల పర్యటన చేస్తున్నారని జిల్లా అంతా కోడై కూస్తోంది.

జోరందుకున్న ప్రచారం



పార్వతీపురంటౌన్: పట్టణంలో 19వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సార్వత్రిక ఎన్నికలకు మరో పది రోజులే ఉన్నందున ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వివిధ పార్టీల అభ్యర్థులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ గ్రామాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు బూటకపు హామీలతో ప్రజల మధ్యకు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పార్వతీపురం పట్టణంలోని 19వ వార్డులో, సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట, గుమిలంమడివరంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్వతీపురం పట్టణంలోని 19వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు రెడ్డి జగన్నాథం ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు జోగారావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వందలాది మంది అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జోగారావు వెంట నడిచారు. ఈ సందర్భంగా జై జగన్, జై జోగారావు నినాదాలు మిన్నంటాయి.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురంటౌన్: జోగారావుకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



పార్వతీపురంటౌన్: టీడీపీ నాయకుడు రెడ్డి జగన్నాథంను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న జోగారావు



పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలోని 2వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కె.బాలకృష్ణ



సీతానగరం: లచ్చయ్యపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: పెదబోగిలిలో ఉపాధి వేతనదారులను కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరుతున్న సచివాలయ కన్వీనరు బి.సూర్యనారాయణ



సాలూరు రూరల్: మామిడిపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వాడ రామకృష్ణ, భరత్‌శ్రీనివాస్



పాచిపెంట: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గిరిశిఖర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వీరంనాయుడు, తదితరులు



బలిజిపేట: పలగరలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు



మక్కువ: లింగాడవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడు



మక్కువ: చెముడులో మావుడి సోదరులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



సాలూరు రూరల్: తుండ గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సాలూరు: పట్టణంలోని 8వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు



సాలూరు రూరల్: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తుండ గ్రామస్తులు



సీతానగరం: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లచ్చయ్యపేట గ్రామస్తులు